కరువును ధైర్యంగా ఎదుర్కొందాం

- డిసెంబర్ 6లోగా వెలిగల్లు నీటిని విడుదల చేయిస్తాం
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : కరువు పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొందామని రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాయచోటి నియోజకవర్గ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయంలో అప్పటి ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడాదిన్నర కాలంలో వెలిగల్లు ప్రాజెక్టు కాలువలతో సహా పనులు పూర్తి చేశారన్నారు. అప్పట్లో వెలిగల్లు ప్రాజెక్టులోకి నీళ్లు రావు, పూర్తిగా నిండదని కొంతమంది మాట్లాడారని, కానీ ప్రాజెక్టు నిండి ఐదారు సార్లు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి దొర్రిచెరువు 56 కి.మీ వరకు, రామరాజు వంక వరకు కాలువల ద్వారా చెరువులకు నీరు చేరుతోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ దూరదృష్టితో ప్రాజెక్టులను నిర్మించడం జరిగిందని, అదే స్ఫూర్తితో సీఎం జగన్ ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, డిసెంబర్ 6వ తేది వరకు వెలిగల్లు నీటిని విడుదల చేయిస్తామన్నారు. నీటిని వృథా కానివ్వకుండా అన్ని చెరువులకు నీటితో నింపుతామన్నారు.

అన్నదాతలకు తోడుగా నిలుద్దాం

కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు తోడుగా నిలుద్దామని పేర్కొన్నారు. మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిందన్నారు. 1,800 ఎకరాలలో ప్రస్తుతం మండలంలో రైతులు పంటలను సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయని, వ్యవసాయానికి 7గంటలు పాటు విద్యుత్ సరఫరా జరుగుతోందని ట్రాన్స్‌కో అధికారులు వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగేళ్లలో 5,600 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు(ట్రాన్స్‌ఫార్మర్లు) అందించడం జరిగిందని సభలో తెలియజేశారు.

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలి...

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలలని అధికారులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని, కొన్ని ప్రాంతాలలో తాగునీటి సరఫరా ట్యాంకర్ల ద్వారా సరఫరా, బోర్ల లోతును పెంచడం, మోటర్లు రిపేరుతో తాగునీటి ఇబ్బందులను పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామాల వారీగా తాగునీటి సమస్యలపై నివేదికలు తయారు చేయాలన్నారు.

కరోనా సమయాలలో నియోజకవర్గ ప్రజలకు తోడుగా నిలిచామన్నారు. కరోనా ఆసుపత్రుల్లో వెళ్లి రోగుల దగ్గరికి కూర్చున్నామన్నారు. చిత్తశుద్ధితో పని చేస్తామని, ఎక్కడా వెనకడుగు వేయలేదన్నారు.

గృహ నిర్మాణాలలో వేగం పెంచాలి...

అర్హులందరికి పక్కాగృహాలు కల్పించడమే సీఎం జగన్ ధ్యేయమన్నారు. మండలంలో 1,900 పక్కా గృహాలు మంజూరయ్యాయని, గృహ నిర్మాణాలలో వేగం పెంచాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మండలంలో 12వేల గృహాలను సందర్శించామన్నారు. రూ. 3.20 కోట్లతో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వ పనులను వేగం చేయాలని, ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా, విలేజ హెల్త్ క్లినిక్, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పీహెచ్‌సీలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.

రెవెన్యూలో విప్లవాత్మక మార్పులు

చుక్కల భూముల విషయంలో రైతులకు శాశ్వత పరిష్కారాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చూపించిందన్నారు. అలాగే కొన్ని గ్రామాలలో ఉండే పరిష్కారం కాని భూములు కూడా రీ సర్వేతో పరిష్కారం కాబోతున్నాయని రైతులకు ఎంతో మంచి జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే ఇనాం భూములు కూడా తహశీల్దార్ స్థాయిలో నుంచి పరిష్కారానికికూడా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈనెల 15 నుంచి పేదలకు భూ పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అసైన్‌మెంట్ , చుక్కల భూముల వివరాలను నోటీసు బోర్డులలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యాక్షులు రవిశంకర్, రెడ్డిబాబు, జెడ్పీటీసీ వెంకటరమణ, సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి ఆదినారాయణరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, పప్పిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ అరవింద్ కిషోర్, ఎంపీడీఓ హైదర్‌వల్లి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పైపులైన్ల నిర్మాణానికి నిధులు మంజూరు

- రూ.30 కోట్లతో మున్సిపాలిటీలో కొత్త పైపులైన్లు
- త్వరలో టెండర్లను పిలవనున్న మున్సిపల్‌శాఖ

రాజంపేట టౌన్: మున్సిపాలిటీ పరిధిలో కొత్త పైపులైన్ల నిర్మాణానికి రూ.30.12 కోట్లు మంజూరైనట్లు మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమృత్ 2.0 పథకం కింద పైపులైన్ల నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యి ఈ ఏడాదిలోపే పనులను కూడా ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు జోన్లుగా విభజించి ఏడు కిలోమీటర్ల మేర కొత్త పైపులైన్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఇందులో ప్రధాన పైపు లైనును 12 ఇంచులతో, నాలుగు ఇంచులతో ఇంటర్నల్ పైపులైను నిర్మాణం జరుగుతుందని వివరించారు. వీటితో పాటు పట్టణంలో 800 కిలో లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, అన్నమయ్య డ్యామ్‌లో 40 హెచ్‌పీ మోటారును కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో కొన్ని దశాబ్దాల క్రితం వేసిన పైపులైన్లు ఉన్నాయని, అందువల్ల పైపులు తరచూ పగిలిపోవడంతో అప్పుడప్పుడు ప్రజలకు నీటి సరఫరా ఆగిపోతోందన్నారు. అయితే కొత్తపైపులైన్లు ఏర్పాటైతే అలాంటి సమస్య ఉండదని తెలిపారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విశేష కృషి ఫలితంగా రాజంపేట మున్సిపాలిటీకి ఈ ప్రాజెక్టు మంజూరు కావడమే కాక త్వరితగతిన నిధులు మంజూరు అయ్యాయని చైర్మన్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల మంజూరుకు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ చీఫ్ ప్రసాదరావు, ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారన్నారు. అందువల్ల విజయవాడలోని ఆయన కార్యాలయంలో ప్రసాదరావును, శ్రీనాథ్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తాం

–డీఈఓ రాఘవరెడ్డి


విద్యార్థులతో డీఈఓ, ఎంఈఓ, ఉపాధ్యాయులు

సిద్దవటం : విద్యార్థులకు చదువు బాగా చెప్పే ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తామని డీఈఓ రాఘవరెడ్డి అన్నారు. సిద్దవటం మండలం లోని భాకరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన 10వ తరగతి విద్యార్థుల అభినందన కార్యక్రమానికి డీఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చాలా చక్కగా పాఠ్యాంశాలను బోధిస్తున్నారన్నారు. దానికి తగ్గ ఫలితాలు కూడా వస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకొచ్చారన్నారు. అనంతరం ఈఏడాది 10వ తరగతి పరీక్షల్లో భాకరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీలు తెలుగు సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను తెలుగు ఉపాధ్యాయుడు మేకల శివార్జున ప్రోత్సాహకంగా ఒక్కొక్క విద్యార్థినీకి రూ.516 నగదు తోపాటు ప్రశంసా పత్రాలను డీఈఓ చేతులమీదుగా అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మికేశమ్మ, ఫిజికల్ డైరెక్టర్ కె. రామచంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా నీటి ట్యాంక్‌ల నిర్మాణ పనులు


ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ ప్రతాప్‌రెడ్డి

గాలివీడు : మండల కేంద్రంలోనినాలుగు రోడ్ల సమీపంలో పాత ప్రభుత్వ వైద్యశాలలో మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కృషితో గోరాన్‌చెరువు గ్రామం అవులశెట్టివారిపల్లెకు రూ28లక్షలతో 60 కెఎల్ సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ , మండల కేంద్రం చెక్కావాండ్లపల్లెకు రూ36లక్షలు 40 కెఎల్ సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను జేజేఎమ్ నిధులతో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. మూడు నెలలలో పనులు పూర్తిచేసి ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించడం కోసం అధికారులు కృషి చేస్తున్నారు.

ఆశ్రమ అభివృద్ధికి సహకరిస్తా

నందలూరు (రాజంపేట) : మండలంలోని ఆడపూరు గ్రామంలో వెలసిన సత్సంగ ఆశ్రమం అభివృద్ధికి సహకరిస్తానని రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకులు ఎల్లటూరు శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఆశ్రమంలోని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ అన్ని దానాలకల్లా అన్నదానం చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వహకులు సి రవీంద్రరాజు , సింగంశెట్టి నరేంద్ర, ఆకుల చలపతి, నాసీర్ ఖాన్, మౌల, చిట్టి భాస్కర్, నారాయణ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

పుల్లంపేట: పుల్లంపేట మండలంలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎస్ వెంకటరమణ శనివారం తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తమ సొంత డబ్బులతో విద్యాసామగ్రి అందించారు. ఉపాధ్యాయురాలు మల్లేశ్వరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు గ్రామానికి చెందిన లాల్ బహుదూర్ అవార్డు గ్రహీత పుట్టంరెడ్డి రాఘవరెడ్డి విగ్రహ ప్రతిష్టను హైస్కూల్ సమీపంలో ఆదివారం ప్రారంభించనున్నారు. పుట్టంరెడ్డి రాఘవరెడ్డి గతంలో జిల్లా ప్రెసిడెంటుగా రెండుసార్లు ఏకగ్రీవంగా పనిచేశారన్నారు. అలాగే గుంజన నదిపై 1880లో కట్టుగొమ్మ నిర్మించారు.

నేడు ప్రముఖులు రాక... పుట్టం రెడ్డి విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంటు కొండూరు విజయ్ రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

జగనన్న పాలనలో ఆలయాలకు మహర్దశ


ఆలయ ప్రారంభంలో ఎమ్మెల్యే గడికోట

సంబేపల్లి: సంబేపల్లె మండలం, గుట్టపల్లె గ్రామ అంకిరెడ్డిగారిపల్లెలో రామాలయం, గుదియవాండ్లపల్లె దళితవాడలో గంగమ్మ ఆలయాల ప్రారంభాలలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో ఆలయాలకు మహర్దశ కల్గిందన్నారు. శనివారం రాత్రి ఆలయ ప్రారంభంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డి, ఎంపీపీ ఆవుల నాగ శ్రీలక్ష్మి, క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ బోర్డు డైరెక్టర్ నిర్మలమ్మలతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయాల శిలాఫలకాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంకిరెడ్డిగారిపల్లె ఆలయం వద్ద ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గుట్టపల్లె, ఎస్ సోమవరం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం అంకిరెడ్డిగారిపల్లెలో రూ. 5 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కన్వీనర్ ఉదయకుమార్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది ప్రభాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ పాలవెంకటరమణ, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణా రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

సంబేపల్లెను కరువు మండలంగా ప్రకటించాలి

సంబేపల్లి: సంబేపల్లె మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం నాయకులు కోరారు. శనివారం దుద్యాల గ్రామంలో ఎండిపోయిన పంటపొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబేపల్లె మండలంలో ఉన్న రైతులు కరువు కాటకాలతో అల్లాడుతున్నారని, వరుణ దేవున్ని నమ్ముకొని పంటలు పెడితే సకాలంలో వర్షాలు కురవక సాగుచేసిన పంటలన్నీ నేలపాలు అవుతున్నాయన్నారు. రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, రైతులు రవీంద్రనాథ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చ


నియోజకవర్గ అభివృద్ధి గురించి ఎంపీ మిథున్ రెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే

ఓబులవారిపల్లె: రైల్వేకోడూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు శనివారం తిరుపతిలోని ఎంపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో కలిసి ఎంపీతో చర్చించారు. ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో పక్కా రోడ్లు నిర్మించినట్లు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మండల నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, రైల్వేకోడూరు వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి ఎంపీటీసీ పైడి గిరినాయుడు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం


మాట్లాడుతున్న సివిల్ కోర్టు జడ్జి అంజనీ ప్రియదర్శిని

రైల్వేకోడూరు : బాల్య వివాహాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రైల్వేకోడూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అంజనీ ప్రియదర్శినీ శనివారం తెలిపారు. మినీ గురుకులం, ఎస్టీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహమనేది పిల్లల హక్కులను ఉల్లంఘిస్తుందని, బాల్య వివాహం పిల్లల విద్య, ఆరోగ్యం, రక్షణ ప్రతి దానికి ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. చిన్న తనంలో అవగాహన లోపంతో కొంతమంది తల్లిదండ్రులు ఆడబిడ్డలను యుక్త వయస్సు రాకముందే పెళ్లి చేస్తారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బార్ ప్రెసిడెంట్ వెంకటరామరాజు, సీనియర్ న్యాయవాదులు సురేష్ రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ

సంబేపల్లె: నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపిపి నాగశ్రీలక్ష్మీ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ప్రారంభించిన అంగన్ వాడీ భవనాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వారు ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు, ఇంజనీర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎంపీడీఓ నరసింహులు, మండల ఉపాధ్యక్షులు రవీంద్ర నాయుడు, ఎంపీటీసీ శ్రీధర్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్, ఎంఈఓ శ్రీనివాసులు, ఇంజనీర్ అధికారులు పాల్గొన్నారు.

8 నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

ఓబులవారిపల్లె: మండలంలోని కొర్లకుంట గ్రామంలోని శ్రీ అంకాలమ్మ దేవత ఆలయంలో భూపతిరాయుడు స్వామి, నీలకంఠేశ్వరస్వామి, నందీశ్వరస్వాముల విగ్రహాల ప్రతిష్టను ఈనెల 8 నుంచి 10వ తేది వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొర్లకుంట గ్రామంలో మూడురోజులపాటు విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

సన్మానం

రాజంపేట : నేటి సమాజంలో యువత షేక్ గౌస్ బాష (లియో ఫిట్నెస్ జిమ్ నిర్వహకులు) లాంటి బాడీ బిల్డర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని రాజంపేట డీఎస్పీ చైతన్య అన్నారు. శుక్రవారం ఎస్‌డీపీఓ కార్యాలయంలో గతనెలలో ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ భీమవరం పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో 70 కేజీల విభాగంలో రాజంపేటకు చెందిన గౌస్ బాష ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఆయన్ను డీఎస్పీ సన్మానించారు. సీఐలు, ఎస్ఐ భక్తవత్సలంపాల్గొన్నారు.

క్లుప్తంగా

రక్తదానం

రాయచోటిటౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన మనీషా అనే మహిళకు రక్తదానం అవసరం కావడంతో డాక్టర్ అబ్దుల్ కలాం యువ ట్రస్టు డైరెక్టర్ వినయ్‌కుమార్ ముందుకొచ్చి రక్తదానం చేశారు. బాధిత బంధువులు ఆ మహిళకు అత్యవసరమని చెప్పడంతో వెంటనే స్పందించిన వినయ్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఇప్పటి వరకు తాను 12 సార్లు రక్తదానం చేశానని చెప్పారు. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు.

ఎస్. రాజంపేటలో పంటకోత ప్రయోగం

సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని ఎస్. రాజంపేట గ్రామంలో శనివారం వరి పంటలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించామని బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్. రాజంపేట గ్రామం లోని సిద్దవటం విష్ణువర్ధన్‌నాయుడు భూమిని (కౌలు రైతు భవనాశి యానాదయ్య) సర్వేనెంబర్ 88/2లో బిపిటి 5204 అనే రకానికి చెందిన వరి పంటను సాగుచేశారన్నారు. కాగా ఈ ప్రయోగంలో 15.750 కిలోల దిగుబడిగా నమోదైందన్నారు. పంట కోత ప్రయోగంలో ఉత్పత్తి, ఉత్పాదకత అంచనాతో పాటు, పంటల బీమా మదింపు , వర్తింపుకు కు దోహదపడుతుందని ఆయన అన్నారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చదువులో విలీనం


నూరుశాతం హాజరు కలిగిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లి: ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలోకి విలీనమైన విద్యార్థులు చదువుపట్ల ఆసక్తి పెంపొందించుకొని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రార్థనా సమయంలో మూడవ తరగతికి పాఠాలు చెప్పే ఉపాధ్యాయినీ ఉమాదేవి నూరుశాతం హాజరును నమోదు చేసుకున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 3,4,5వ తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం వల్ల అది వారి పాలిట వరంగా మారిందన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు 18 సబ్జెక్టులను బోధించే పరిస్థితి ఉండేదన్నారు. ఆ విద్యార్థులను ఉన్నత పాఠశాలలోకి విలీనం చేయడం వల్ల వారికి సబ్జెక్టు వారిగా బోధించడానికి ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చారన్నారు. హైస్కూళ్ల పరిధిలోకి 3,4, 5వ తరగతులు తేవడం అనేది విద్యలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తుందన్నారు.

చిట్వేలి తహసీల్దార్‌కు సన్మానం

చిట్వేలి: స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన తహశీల్దార్ శిరీషాను శనివారం వైఎస్సార్ సిపి నాయకులు సన్మానించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ ఉమా మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు సభ్యులు మలిశెట్టి వెంకటరమణ, భాస్కర్ రెడ్డి, మాధినేని కనకరాజు తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహశీల్దార్‌గా మండల ప్రజలకు ఆమె అందించిన సేవలను కొనియాడారు. రసింహ, మణి, ఆర్ఐ శేషంరాజు, సీనియర్ అసిస్టెంట్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గాలివీడు: మండల కేంద్రంలోని రవిచంద్ర ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 8 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ షింటో ఇమ్మానెయుల్ తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినంద సభలో మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలతో సత్కరించారు. బ్యాడ్మింటన్ అండర్ 14 విభాగంలో ప్రణవి, ప్రణీత(8వ తరగతి), అండర్ 17 విభాగంలో రీనాద్(9వ తరగతి), మల్కం పోల్ క్రీడలో తనీష్‌కుమార్ రెడ్డి(10వ తరగతి) , టెన్నిస్ వాలీ బాల్ విభాగం రెడ్డెమ్మ(9వ తరగతి), హాకీ క్రీడలో సాయి ప్రణతి, ఫుట్‌బాల్ విభాగంలో తాహసీన్, సానియాలు(7వ తరగతి) విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

10న చెకుముకి పరీక్ష

రాజంపేట రూరల్: ఈ నెల 10వ తేదిన నిర్వహించే చెకుముకి సైన్స్ పరీక్షలో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాఫ్‌బాష, ఫ్యూచర్ మైండ్స్ స్కూల్ కరస్పాండెంట్ వై నందకిషోర్‌గౌడ్ కోరారు. స్థానిక ఫ్యూచర్ మైండ్స్ స్కూల్‌లో శనివారం చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన గోడ పత్రాలను జేవీవీ ప్రతినిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థులు ఈ సైన్స్ పరీక్షలో పాల్గొనాలని కోరారు. విద్యార్థులలో విజ్ఞాన దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ పరిక్షలు దోహదం చేస్తాయని తెలియజేశారు.

జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు హర్షణీయం

రాయచోటిటౌన్ : జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం హర్షణీయమని అన్నమయ్య జిల్లా వైఎసీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కుటుంబానికి కంటే సమాజానికి ప్రాధాన్యత ఇస్తూ విలువలతో కూడిన జర్నలిజం చేస్తున్న జర్నలిస్టులందరికీ అభినందనలు తెలియచేశారు. ఎన్నికల ముందు చెప్పిన మేనిఫెస్టోలోని హామీలన్నీ నూటికి నూరు శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయడం, జర్నలిస్టులందరికీ మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వడం చాలా గొప్ప విజయమన్నారు. అక్రిడేషన్ పొందిన ప్రతి జర్నలిస్టుకు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ గారితో చర్చించి అనువైన స్థలాన్ని పరిశీలించి అందజేస్తామని పేర్కొన్నారు.

పరామర్శ

చిట్వేలి: భాకరాపురం కొత్తపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటసుబ్బరాజు, గాయపడిన కనకరాజు కుటుంబాలను శనివారం ఉదయం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, సర్పంచ్ ఉమా మహేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు. వెంకటసుబ్బరామరాజు వంటి విలువైన వ్యక్తిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. అలాగే ప్రమాదం జరిగిన ప్రాంతంలో రోడ్డు విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు అధికారులతో చర్చించి ఏర్పాట్లు చేయడంతోపాటు వేగనిరోధక సూచికలను ఏర్పాటు చేయించారు. అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

నందలూరు (రాజంపేట): టపాసుల యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మన్నూరు సీఐ మంజునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నందలూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చట్టపరమైన సమస్యలు ఏర్పడినప్పుడు తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, ఏఎస్ఐ శంకర్ నాయక్, పోలీసులు పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

రైల్వేకోడూరు అర్బన్: నిబంధనలు అనుసరించి టపాసులు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ మధుసూదన్ రెడ్డి శనివారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టపాసుల దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలీస్ శాఖ పరిధిలో లైసెన్సులు లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.